క్లుప్తంగా

నేడు కౌన్సిల్ సమావేశం

దాచేపల్లి : నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎంవీ అప్పారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అధ్యక్షతన దాచేపల్లి-1 సచివాలయంలో గురువారం కౌన్సిల్ సమావేశం జరుగుతుందని, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

అనధికార ఫ్లెక్సీలను వెంటనే తొలగించండి

మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు



మాచర్ల: పట్టణంలోని మెయిన్ రోడ్డు, పలు ప్రాంతాలలో బిల్డింగ్‌ల పైన జంక్షన్ ప్రాంతంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను వెంటనే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజా భద్రత దృష్ట్యా, పబ్లిక్ రాకపోకలు దృష్టిలో పెట్టుకొని ఎవరికీ ఇబ్బంది లేకుండా వెంటనే ఫ్లెక్సీల తొలగింపు చేపట్టాన్నారు. ఎవరైతే ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారో వారే మూడు రోజులలోపే తొలగించాలని, లేనిచో పురపాలక సంఘ అనుమతులు తీసుకోవాలని, లేకపోతే వాటిని తొలగించే చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు పిడుగురాళ్లలో జాబ్ మేళా

పిడుగురాళ్ల : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో ఈ నెల 31వ తేదీన జాబ్ మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఈ తమ్మాజీరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాలో నిరుద్యోగులు పాల్గొనాలని ఆయన కోరారు. పదవ తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న, 18 నుంచి 40 సంవత్సరాల లోపు నిరుద్యోగులు హాజరుకావాలని ఆయన తెలిపారు. ఎడ్యుకేషన్ సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9492158153 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

అన్న క్యాంటీన్ పరిశీలన



పిడుగురాళ్ల : పట్టణంలోని అన్న క్యాంటీన్‌లో భోజనం నాణ్యతను బుధవారం మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ పరిశీలించారు. మధ్యాహ్నం పేదలకు అందిస్తున్న భోజనం నాణ్యత, రుచిపై భోజనం చేస్తున్న వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీధర్ మాట్లాడుతూ భోజనంలో రుచి, నాణ్యత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. నాణ్యత పట్ల భోజనం చేసిన వారి వివరాల మేరకు సంతృప్తి వ్యక్తం చేశారు.

ఎన్నికల కోడ్ అమలు

దాచేపల్లి : కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని నగర పంచాయతీ కమిషనర్ వైవీ అప్పారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఉత్తర్వుల మేరకు నేటి నుంచి మార్చి 8వ తేదీ వరకు కోడ్ అమలులో ఉంటుందని, నగర పంచాయతీ పరిధిలోని అన్ని శాఖల అధికారులు కోడ్ ఉల్లంఘనలకు పాల్పడకుండా జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

పరిశుద్ధాత్మ వేడుకకు ఆహ్వానం




విజయపురిసౌత్: మాచర్ల మండలం విజయపురిసౌత్‌లోని గ్లోరి ఆఫ్ క్రైస్ట్ చర్చిలో 40 దినాల ఉపవాస ప్రార్థనలు ముగింపు సందర్భంగా ఫిబ్రవరి 10న జరిగే పరిశుద్ధాత్మ వేడుకకు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి చర్చి పెద్దలు బుధవారం వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహించే పరిశుద్ధాత్మ వేడుకలో పాల్గొనాలని ఎమ్మెల్యేను వారు కోరారు. అనంతరం ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయపురిసౌత్ టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, పాస్టర్ దానియేలు, ఆడెపు కోటయ్య, బొబ్బిలి చంద్రశేఖర్, గంటా ధనుంజయరావు, ఖాసిమ్, ఊరే మార్క్, రామచంద్, చరణ్, రావుల శ్రీను, ఏసు, యాకోబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కారెంపూడిలో అన్నదానం

కారెంపూడి: సూరె వెంకట రామాంజనేయులు జ్ఞాపకార్థం ఆయన కుటుంబీకులు స్థానిక ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో బుధవారం అన్నదానం చేశారు. సుమారు 300 మంది పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమ నిర్వహణలో భవిరిశెట్టి రామారావు, భవిరిశెట్టి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల కట్టడి



గురజాలలో ఇంటి వద్ద ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరా

- ఏర్పాటు చేసుకోవాలని కోరుతున్న పోలీసులు
- గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు విస్తృత అవగాహన
- ప్రతి కేసు దర్యాప్తులో కీలకంగా ఫుటేజ్
- ప్రధాన కూడళ్లు.. వ్యాపార కేంద్రాల వద్ద నిఘా నేత్రం

గురజాల : రోజురోజుకూ సీసీ కెమెరాల ప్రాధాన్యం పెరుగుతుంది. పట్టణాలు, గ్రామాల్లో నేరాల నియంత్రణ, ప్రజలకు భద్రత కల్పించేందుకు సీసీ కెమెరాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. ఇవి ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గుతుండటంతో గ్రామీణ, పట్టణ ప్రజలు వారి వారి నివాస ప్రాంతాల్లో వాటిని బిగించుకునేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు పోలీసులు గ్రామాల్లో పర్యటించినప్పుడు సీసీ కెమెరాల ఏర్పాటుపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారు. కేసుల విచారణలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నట్లు పోలీసులు ప్రజలకు చెబుతున్నారు. దీంతో ప్రజలు కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఒక్క రోజులో 15 దొంగతనాలు

పోలీస్ శాఖ ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేస్తోంది. ప్రతి కేసు విషయంలో ప్రజలకు సత్వర న్యాయం అందించేలా, వారికి రక్షణ కల్పించే విధంగా కృషి చేస్తుంది. ఈ క్రమంలో పోలీసు అధికారులు గ్రామాల్లో, పట్టణాల్లో పర్యటించిన సమయాల్లో ప్రజలకు సీసీ కెమెరాల ఏర్పాటు, సెలవుల్లో ఊరు వెళ్లే సమయంలో పోలీసులకు సమాచారం ఇస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ విధానం గురించి పదే పదే చెబుతున్నారు. గత కొద్ది రోజుల క్రితం దాచేపల్లి, గురజాల ప్రాంతాల్లో ఒకే రోజు 15 దొంగతనాలు జరిగాయి. దొంగలు ఎక్కువగా సీసీ కెమెరాలు లేని ప్రాంతాల్లోనే దొంగతనాలకు పాల్పడ్డారు. దీనిని బట్టి సీసీ కెమెరాల ఆవశ్యకత ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఎప్పటికప్పుడు గమనించవచ్చు

పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ప్రధాన కూడళ్లు, స్కూల్స్, కళాశాలలు, బస్టాండ్, ముఖ్య కూడళ్ల వ్యాపార వాణిజ్య కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ జగదీష్ తెలుపుతున్నారు. ఈ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ఉంటే పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించవచ్చు. గురజాల పట్టణంలో అక్కడక్కడ ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ కొన్ని పనిచేయడం లేదు.



దుకాణంలో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరా

పరిశోధన, నియంత్రణలో పెరిగిన ప్రాధాన్యం



నేర పరిశోధన, నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యం పెరిగింది. దొంగలు, దోషులను పట్టుకోవడంలో మార్గం సుగమం అవుతుంది. గతంలో దొంగతనాల పరిశోధన ఇబ్బందికరంగా ఉండేది. ఇప్పుడు సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతాల్లో చోరీలు తగ్గుముఖం పట్టాయి. సీసీ ఫుటేజ్ ద్వారా దోషులను గుర్తించి గంటల వ్యవధిలోనే పట్టుకునే అవకాశం ఉంది. ప్రజలు స్వచ్ఛందంగా తమ వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే బాగుంటుంది.

– జగదీష్, డీఎస్పీ, గురజాల

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



ప్రతి వీధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. సీసీ కెమెరాలు ఉంటే దొంగతనాలు జరగకుండా ఉండే అవకాశాలు ఉన్నాయి. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి సీసీ కెమెరాలు ఏర్పాటుకు ముందుకు రావాలి. ఒక్క సీసీ కెమెరా 10 మంది పోలీసులతో సమానం. దొంగతనాలు జరుగకుండా ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలి. గ్రామాల్లో, పట్టణంలో సీసీ కెమెరాల గురించి అవగాహన కల్పిస్తూనే ఉన్నాం.

– ఆవుల భాస్కర్, సీఐ, గురజాల

రేపు అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం



తహసీల్దార్‌ను ఆహ్వానిస్తున్న కమిటీ సభ్యులు

మాచర్ల / మాచర్ల రూరల్ : పట్టణంలో వేంచేసియున్న వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈ నెల 31న శుక్రవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు భవనాశి వెంకటేశ్వర్లు, కార్యదర్శి సన్నిధి హనుమంతరావు, జాయింట్ సెక్రటరీ తిరివీధి వెంకట నాగేశ్వరరావులు తెలిపారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం తెల్లవారుజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు, 102 మంది కన్యలచే అభిషేకం, కుంకుమ పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది నుంచి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని అందులో భాగంగా నియోజకవర్గ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, పలువురు అధికారులు, నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులను ఆహ్వానించి కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

రెంటచింతల: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆర్యవైశ్యుల ఇలవేల్పు అయిన వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఈ నెల 31న నిర్వహించనున్నట్లు దేవస్థానం అధ్యక్షుడు కట్టమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 7 గంటలకు ఆర్యవైశ్య పతాకావిష్కరణ, 9 గంటలకు 102 మంది కన్యలచే గణపతి పూజ, అభిషేకం, హోమం, కుంకుమ పూజ, ఆర్యవైశ్య దంపతులచే గణపతి పూజ, పుణ్యాహవాచనం, అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్ర నామ పూజ నిర్వహించడం జరుగుతుందన్నారు. సాయంత్రం 4 గంటలకు భగవద్గీత పారాయణం, 6 గంటలకు విష్ణు, లలితా సహస్ర నామ పారాయణ, రాత్రి 8 గంటలకు అమ్మవారి ఊరేగింపు ఉంటుందన్నారు. వివిధ గ్రామాలకు చెందిన ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని వాసవీ అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో దేవస్థానం పాలకవర్గ సభ్యులు నాళం చినబాబు, దేవరశెట్టి వెంకట నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వరిగడ్డి వాములు దగ్ధం



దాచేపల్లి : మండలంలోని శ్రీగనర్ గ్రామంలో ప్రమాదవశాత్తూ వరిగడ్డి వాములు మంగళవారం సాయంత్రం దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన నాగిరెడ్డి వరిగడ్డిని నిల్వ చేశాడు. ప్రమాదవశాత్తు వరిగడ్డి వామికి నిప్పు అంటుకోవటంతో మంటలు వ్యాపించాయి. సమీపంలోని సాగర్ సిమెంట్స్‌లోని అగ్నిమాపక సిబ్బందికి బాధితుడు సమాచారం ఇచ్చాడు. తక్షణమే అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు రూ.20 వేల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు నాగిరెడ్డి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రోటరీ క్లబ్ చేయూత

మాచర్ల రూరల్: పేద బడుగు, బలహీన వర్గాలు విద్యకు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం రోటరీ క్లబ్ సహాయ సహకారాలు ఎప్పుడూ అందిస్తుందని రోటరీ క్లబ్ అధ్యక్షులు కొండవీటి కృష్ణకుమారి అన్నారు. బుధవారం మండలం, పట్టణంలోని పలు ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందించి మాట్లాడారు. రోటరీ క్లబ్ విద్య, వైద్యం, నీరు అందించటంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని, ఈ నేపథ్యంలో పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందిస్తున్నామని, అలాగే ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తమ సంస్థ సిద్ధంగా ఉందన్నారు. ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు బహుమతులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నిమ్మగడ్డ సురేఖ, కోశాధికారి అన్నపురెడ్డి లక్ష్మి, సుశీల, హెచ్‌ఎం బోనాల కల్పన, ఉపాధ్యాయులు, సభ్యులు పాల్గొన్నారు.

ఫినాయిల్ తాగి మహిళ ఆత్మహత్యాయత్నం

నరసరావుపేట: విజయపురిసౌత్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్న ఓ మహిళ ఉద్యోగం పోతుందనే భయంతో ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామంలోని అమరలింగమ్మ గత పదేళ్లుగా హెల్త్ సెంటర్ కాంట్రాక్టర్ వద్ద స్వీపర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తుంది. త్వరలో కాంట్రాక్టర్ గడువు ముగుస్తుండటంతో ప్రస్తుత ప్రభుత్వానికి చెందిన మరో వ్యక్తికి కాంట్రాక్ట్ వస్తుందని దీంతో తనని ఉద్యోగం నుంచి తీసేస్తారని ఆమెకు సమాచారం తెలిసింది. దీంతో భయాందోళనకు గురై ఇంట్లో ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బంధువులు హుటాహుటిన గ్రామంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించటంతో డాక్టర్లు చికిత్స అందించారు. ప్రస్తుతం అమరలింగమ్మ ఆరోగ్యం నిలకడగా ఉంది.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

సీఐ ఆవుల భాస్కర్

గురజాల : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గురజాల సీఐ ఆవుల భాస్కర్ అన్నారు. స్థానిక దండివాగు వద్ద బుధవారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ప్రమాదాలు జరిగినా తలకు గాయం కాకుండా రక్షించుకునే అవకాశం కలుగుతుందన్నారు. కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వారి ప్రాణాలను కాపాడుకోవాలన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

నకరికల్లు: ప్రమాదవశాత్తు బెల్లంకొండ బ్రాంచికెనాల్‌లో కాలువలో జారిపడి గల్లంతైన వ్యక్తి మృతదేహం బుధవారం పోలీసులు గుర్తించారు. ఫిరంగిపురం గ్రామానికి చెందిన మహమ్మద్ తాజుద్దీన్ రంగురాళ్ల కోసం వచ్చి త్రిపురాపురం సమీపంలోని కాలువలో జారిపడి గల్లంతైన విషయం విధితమే. బెల్లంకొండ బ్రాంచికెనాల్‌లో లభ్యమైన మృతదేహాన్ని వెలికితీసి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేటలోని ఏరియా వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

పశు ఆరోగ్య శిబిరం పశు పోషకులకు వరం

పశు వైద్యాధికారి మల్లారెడ్డి



పశు ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మండల పశు వైద్యాధికారి మల్లారెడ్డి, గ్రామ పెద్దలు

పాలువాయి(రెంటచింతల): రాష్ట్ర పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో వివిధ గ్రామాలలో నిర్వహిస్తున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు పశు పోషకులకు ఓ వరమని తుమ్మకోట పశు వైద్యాధికారి మల్లారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పాలువాయి గ్రామంలో జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం సౌజన్యంతో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరంలో 34 మంది పశు పోషకులకు చెందిన 22 ఆవులకు, 42 గేదెలకు గర్భకోశ వ్యాధి పరీక్షలు చేయడం జరిగిందన్నారు. 24 దూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశామన్నారు. గ్రామాలలో నిర్వహిస్తున్న ఈ శిబిరాలలో ఉచితంగా పశువులకు ఆరోగ్య పరీక్షలు, తేలికపాటి శస్త్రచికిత్సలు, గర్భకోశ వ్యాధి పరీక్షలు నిర్వహించి తగు వైద్యం చేయడంతో పాటు కోళ్లకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందన్నారు. అదే పశు పోషకులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండలపు విజయలక్ష్మి, గ్రామ పెద్దలు లచ్చిరెడ్డి, శౌంతిరెడ్డి నర్సిరెడ్డి, మండలపు హనిమిరెడ్డి, అల్లం బ్రహ్మారెడ్డి, పశువైద్య సిబ్బంది భాస్కర్ నాయక్, త్రివేణి, కవిత తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో ఉచిత పశు వైద్య శిబిరం

కారెంపూడి: మండలంలోని చింతపల్లి గ్రామంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని వెటర్నరీ డాక్టర్ దిలీప్, పశు వైద్య సిబ్బంది నిర్వహించారు. గ్రామ రైతులు పశువులను వైద్య శిబిరం వద్దకు తీసుకువచ్చి వైద్యం చేయించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ దిలీప్ ఈ సందర్భంగా రైతులకు సూచించారు. వైద్య శిబిరాన్ని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ ప్రారంభించారు.



మందులు పంపిణీ చేస్తున్న పశు వైద్య సిబ్బంది

పీఎంఏవై కింద లబ్ధికి దరఖాస్తుల ఆహ్వానం

కారెంపూడి: స్థలం ఉండి ఇంటి నిర్మాణం చేయదలుచుకున్న వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కారెంపూడి 1, 2 గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు లింగయ్య, రాజునాయక్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. అర్హులైన వారికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందుతుందని పేర్కొన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న పేదలు ప్రభుత్వ నివేశన స్థల పట్టా ఉన్నా అలాగే సొంతంగా స్థలం ఉండి ఇల్లు కట్టుకోడానికి స్థోమత లేని వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఇతర వివరాలకు సెల్ 9160070031, 8125125252 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మునిసిపల్ సమావేశం వాయిదా

పిడుగురాళ్ల : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూలు విడుదల అయినందున పిడుగురాళ్ల మునిసిపల్ కార్యాలయ అత్యవసర సమావేశం వాయిదా వేయడం జరిగిందని మునిసిపల్ చైర్మన్ కొత్తా వెంకట సుబ్బారావు బుధవారం ఒ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ వచ్చినందున సమావేశం తేదీ ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత తెలియజేయడం జరుగుతుందన్నారు.

3న ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మిట్టపల్లి కోటేశ్వరరావు

నరసరావుపేట రూరల్: గుంటూరు గ్రూప్ పరిధిలోని ఎన్‌సీసీ క్యాడెట్స్ అంతర కళాశాలల పోటీలు ఫిబ్రవరి 3వ తేదీన నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ మిట్టపలి వెంకటకోటేశ్వరరావు తెలిపారు. కళాశాలలో బుధవారం పోటీల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్ఈసీ కళాశాల జూబ్లీషన్ 2కే-25లో భాగంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఎన్‌సీసీ డైరక్టరేట్, గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్ హెడ్ క్వార్టర్స్ అనుమతితో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్లటూన్ డ్రిల్, గార్డ్ ఆఫ్ హనర్, అబ్స్టాకిల్ రన్, టగ్ ఆఫ్ వార్, గ్రూప్ డాన్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయని వివరించారు. గుంటూరు గ్రూప్ పరిధిలోని ఐదు జిల్లాల నుంచి 400మంది క్యాడెట్స్ పోటీలో పాల్గొంటారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో మొదటి సారిగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. క్యాడెట్స్‌లో పోటీతత్వం, టీమ్ వర్క్, క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకునేందుకు పోటీలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్‌బాబు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు పారుదలపై ఘర్షణ

బొల్లాపల్లి: ఇరువురు మహిళల మధ్య మురుగునీరు పారుదల విషయంలో వివాదం నెలకొని ఘర్షణకు దారి తీసి ఒక మహిళ ఇంటిపై మరో మహిళ వర్గీయులు దాడులకు పాల్పడిన సంఘటన మండలంలోని సోలాయపాలెంలో జరిగింది. బండ్లమోటు పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన అన్నంగి కోటమ్మకు చెందిన ఖాళీస్థలంలో వలస వచ్చిన మిరప కూలీలు ఉంటున్నారు. ఈ కూలీలకు చెందిన మురుగునీరు లాగా లక్ష్మి ఇంటి ముందుకు వస్తుండగా మురుగునీరు రానివ్వకుండా చూడమని చెప్పడంతో వివాదం నెలకొంది. వివాదం కాస్త ముదిరి ఘర్షణకు దారి తీసింది. అన్నంగి కోటమ్మ వర్గీయులు కొందరు రాళ్లు, కర్రలతో లాగా లక్ష్మి ఇంటిపైకి దాడి చేసి తీవ్రంగా కొట్టడంతో లక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం మేరకు పోలీసులు గ్రామానికి చేరుకొని పరిస్థితిని అదుపు చేసి లక్ష్మిని వినుకొండలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. మరొక వర్గానికి చెందిన అన్నంగి కోటమ్మ, అన్నంగి రామకోటయ్యలకు గాయాలయ్యాయి. వీరిరువురు వినుకొండలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు బండ్లమోటు ఎస్ఐ ఎ.బాలకృష్ణ తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

కనీస వేతనం అమలు చేయాలి

క్రోసూరు: అఖిలభారత అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల ఫెడరేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా స్కీం 50 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈ స్కీంను సంస్థాగతం చేయాలని గౌరవ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మండలంలోని అంగన్‌వాడీలు వినతిపత్రాలు పంపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీఐటీయు క్రోసూరు ప్రాజెక్ట్ అధ్యక్షురాలు బి.జయలక్ష్మి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు వడ్డీతో సహా గ్రాట్యుటీ చెల్లించి రాజ్యాంగ ప్రాథమిక హక్కు అయిన ఆరు సంవత్సరాల లోపువయసు కలిగిన పిల్లలందరికీ శిశుసంరక్షణ విద్యను కట్టుదిట్టంగా అమలు జరిపేలా చట్టం చేయాలని, అందుకు సరిపడా నిధులను బడ్జెట్‌లో కేటాయించాలని ప్రభుత్వాన్ని ఆదేశించవలసినదిగా కోరుతూ గౌరవ రాష్ట్రపతికి దరఖాస్తులు పంపిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీలు దానమ్మ, భూలక్ష్మి, దుర్గభవానీ, షాజిరా, వెంకట్రావమ్మ, మాణిక్యం, రిహానా తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నెలవుగా ప్రధాన రహదారులు



ప్రమాదకరంగా ఉన్న మార్కెట్ యార్డు వద్ద రెండు రోడ్లు కలిసే కూడలి



నడికుడి వద్ద డేంజర్ బెల్స్ మోగిస్తున్న ప్రధాన రహదారి



దాచేపల్లిలో నిత్యం ప్రమాదాలు జరిగే ప్రాంతం

ప్రధాన రహదారులు ప్రమాదాలకు మృత్యుమార్గాలుగా నిలుస్తున్నాయి. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో పలు చోట్ల హైవేలు అత్యంత ప్రమాదకరంగా మారటంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ప్రజలు ప్రాణాలు కోల్పోవటం.. తీవ్రంగా గాయపడటం జరుగుతుంది. నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద అద్దంకి-నార్కెట్‌పల్లి హైవేకి అనుసంధానం చేస్తూ దాచేపల్లి-నాగార్జునసాగర్ హైవేని నిర్మించారు. ఇక్కడ మలుపులు ప్రమాదకరంగా ఉండటం.. పక్క నుంచి వచ్చే వాహనాలు కన్పించకపోవటం వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అదే విధంగా నడికుడి గ్రామ సమీపంలో నిర్మించిన బైపాస్ మలుపు వద్ద కూడా ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాచేపల్లిలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహం వద్ద హైవేకి అనుసంధానంగా తంగెడ, ముత్యాలంపాడు రోడ్డు ఉంది. ఇక్కడ పై ఓవర్ బ్రిడ్జి ఉండటం, మలుపు కూడా ప్రమాదకరంగా ఉండటం వలన ప్రమాదాలకు నిలయంగా మారింది. రోజు చిన్న, పెద్ద ప్రమాదాలు ఇక్కడ జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు అటు హైవే అధికారులు, ఇటు స్థానిక అధికారులు ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోకపోవటం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

- దాచేపల్లి

పునీతురాలు మరియతల్లి

ఫాదర్ సాగర్

రెంటచింతల: ప్రపంచ మానవాళిని పాపముల నుంచి రక్షించుటకు యెహోవా దేవుడు తన కుమారుడైన లోకరక్షకుడు యేసుక్రీస్తు జన్మించుటకు ఎన్నుకోబడిన పునీతురాలు మరియతల్లి అని రెవ.ఫాదర్ పామిశెట్టి సాగర్ (సాగరమాత డైరెక్టర్, విజయపురిసౌత్) అన్నారు. స్థానిక కానుకమాత చర్చి 175వ వజ్రోత్సవ తిరునాళ్ల వేడుకలలో భాగంగా బుధవారం విచారణ గురువులు రెవ.ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి ఆధ్వర్యంలో ఆనంద్‌పేట కాలనీలో నిర్వహించిన నవదిన ప్రార్థనలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. కన్య మరియమ్మ జీవితం కథోలిక సంఘానికి ఆదర్శనీయమన్నారు. ఎంతో పవిత్రమైన మరియతల్లిని ప్రార్థించిన వారి తలంపులు నెరవేరి ఆ తల్లి ఆశీస్సులతో వారు సుఖసంతోషాలతో ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. కానుకమాత మహోత్సవం వరకు నిర్వహిస్తున్న నవదిన ప్రార్థనలలో పాల్గొని తల్లి మరియ ఆశీస్సులు పొందాలని కోరారు. దివ్యపూజాబలిలో ఫాదర్లు అగస్టీన్, కన్యాస్త్రీలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.